క్లుప్తంగా

తిమ్మాపూర్‌లో రథోత్సవం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో సోమవారం రథోత్సవాన్ని నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉమా సంగమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలను చేసిన అనంతరం రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రవీందర్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

నేడు సేవాలాల్ జయంతి



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డిలో నేడు నిర్వహించే సేవాలాల్ జయంతి వేడుకలకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు వస్తున్నట్లు బంజారా సంఘం నాయకులు సోమవారం తెలిపారు. ప్రభుత్వం చే నిర్వహించే అధికారిక సేవాలాల్ జయంతి వేడుకలకు ఆయన హాజరుకానున్నట్లు వారు తెలిపారు. సేవాలాల్ జయంతికి బంజారా సంఘం నాయకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.

విద్యార్థులు ప్రణాళికతో చదవాలి



రాజంపేట : రాజంపేట బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు విజయ స్ఫూర్తి కార్యక్రమాన్ని హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు రహమత్, ఆదామ్, కృష్ణారావ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక ప్రణాళికతో, గట్టి సంకల్పంతో పరీక్షలకు సన్నద్ధం కావాలని అన్నారు. పదోతరగతి విద్యార్థులకు హాజీ నాయక్, రహామత్ సహకారంతో పరీక్ష ప్యాడ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఈశ్వర్, హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు అన్వేశ్‌రావు, కృష్ణాకర్ రావ్, రహమత్ హుస్సేన్ తదితరులున్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థి గూండ్ల సాయిలు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. డిఎఫ్‌సియస్ జిల్లా డైరెక్టర్ శ్రీమతి జయక్ష,స్థానిక గంగపుత్ర సంఘం అధ్యక్షులు భరత్ కుమార్, హెచ్‌ఎం చందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

నియామకం



కామారెడ్డి టౌన్/దోమకొండ : యువజన కాంగ్రెస్ నియోజకవర్గ కార్యదర్శిగా శిరీష్ గౌడ్‌ను నియమించారు. అలాగే సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా భైరవప్రసాద్‌రెడ్డి, కన్వీనర్‌గా అహ్మద్ అశ్వక్‌లను నియమించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల గురుకుల పాఠశాల, లింగంపేట్ గురుకుల పాఠశాలకు చెందిన 229 మంది విద్యార్థులకు గాను 226మంది హాజరయ్యారు. ఫస్టియర్ ఫిజిక్స్, ఎకానామిక్స్ పేపరు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కొనసాగింది. ఈ పరీక్ష కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్‌గా యూసుఫ్ హుస్సేన్, డిపార్టు మెంటల్ ఆఫిసరుగా నగేష్ వ్యవహరించారు. పోలీసులు పరీక్షా ఆవరణలో 144సెక్షన్ విధించారు.

ఉద్యోగ మేళాలో 50 మంది ఎంపిక

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సోమవారం టీఎస్‌కేసీ, దిటైమ్స్ ప్రో సౌజన్యంతో నిర్వహించిన బ్యాంకుల ఉద్యోగమేళాలో తుది పరీక్షకు 50 మంది ఎంపికయ్యారు. ఐసీఐసీఐ, యాక్సిస్, ఎస్, యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో ఉద్యోగాల కోసం ఎంపికలు నిర్వహించారని ప్రిన్సిపాల్ కే విజయ్‌కుమార్ అన్నారు. ఎంపికైన వారిని అభినందించారు. వివిధ విభాగాల సమన్వయకర్తలు చంద్రకాంత్, శంకరయ్య, ఫర్హీన్ ఫాతిమా, అజహారోద్దీన్, టైమ్స్ ప్రో ప్రతినిధి వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్లకు మోక్షమెప్పుడో..?

- తండావాసులకు ఇబ్బందులు
- పలుచోట్ల అర్ధంతరంగా నిలిచిన పనులు
- వర్షాకాలంలో పెరగనున్న తిప్పలు
- ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని వేడుకోలు



నడిమి తండాలో మట్టిరోడ్డు

రాజంపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పల్లె, తండా అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో 2018 ఆగస్టు 2న నూతన జీపీలకు శ్రీకారం చుట్టింది. ప్రతి గ్రామం, పల్లె, తండాలు జీపీలుగా చేయడంతో వాటికి ప్రత్యేక బడ్జెట్, ఆర్థిక వనరులు ఏర్పడటంతో అభివృద్ధిచెందుతాయని ఆశించినా తండాలన్నీ అటవీశాఖ పరిధిలో ఉండడంతో అబివృద్ధికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. రాజంపేట మండలంలోని గుడితండాకు బీటీ రోడ్డు పనుల కోసం సంబంధిత కాంట్రాక్టర్ కంకర వేసి సుమారు మూడేళ్లవుతున్నా ఇప్పటికీ బీటి రోడ్డు పనులు చేపట్టలేదు. అదేవిధంగా ఎల్లారెడ్డిపల్లి నుండి శేర్‌శంకర్ తండా వరకు బీటీ రోడ్డు మంజూరైనప్పటికీ అటవీశాఖ పరిధిలో ఉందని పనులు అర్థాంతరంగా వదిలేశారు. ఎమ్మెల్యే రాష్ట్రస్థాయి ఫారెస్ట్ అధికారులకు స్వయంగా కలిసి విన్నవించినా పరిస్థితిలో మార్పురాలేదు. దీంతో ఎల్లారెడ్డి పల్లి నుంచి ఎల్లారెడ్డిపల్లి తండా వరకు మాత్రమే బీటీ రోడ్డు పనులు జరిగాయి. ఎల్లారెడ్డిపల్లి నుండి శేర్ శంకర్ తండా వరకు బీటీ రోడ్డు పనులు అర్థంతరంగా నిలిచిపోయాయి. ఇక్కడ ఫారెస్ట్ అధికారులు అభ్యంతరం తెలపడంతో పనులు నిలిచిపోయినట్లు తండావాసులు చెబుతున్నారు.

బురదబురదగా..

మడంలంలోని పలుతండాలకు బీటి రోడ్లు లేక పోవడంతో తండావాసులు రావపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం అయితే వీరి బాధలు వర్ణాతీతం. రోడ్లని బురదమయం కావడమే కాకుండా రోడ్డు మరింత గుంతలకు గురై ప్రమాదాలకు దారితీస్తుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు తండాలకు బీటీ రోడ్డు వేసి తమ సమస్యను పరిష్కరించాలని తండాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్లు కావాలి..



తండాకు బీటీ రోడ్డు పనులు ప్రారంభించి సుమారు నాలుగేళ్లు కావస్తోంది. సంబంధిత కాంట్రాక్టర్ కంకర వేసి మధ్యలో వదిలేశాడు. ఇప్పటికీ ఎలాంటి పనులు పూర్తికాలేదు. కంకరపై ప్రయాణం చేయాలంటే ఇబ్బందిగా ఉంది. అదే విధంగా గుడితండా గ్రామ పంచాయతీ పరిధిలోని కొతిమీర్ తండాకు బీటీ రోడ్డు పనుల చేయాలని కోరుతున్నాం.

– షేర్‌సింగ్, గుడితండా గ్రామస్తుడు

పొట్ట దశలో వరిని కాపాడుకోవాలి





పోతంగల్ కలాన్ శివారులో వరిని పరిశీలిస్తున్న ఏవో నరేశ్, గోర్గల్ శివారులో..

గాంధారి(ఎల్లారెడ్డి) : పొట్టదశలో ఉన్న వరికి యూరియా, పొటాష్ కలిపి చల్లాలని ఏవో నరేశ్ రైతులకు సూచించారు. సోమవారం ఆయన పోతంగల్ కలాన్ శివారులో పర్యటించి యాసంగిలో సాగు చేసిన వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. యూరియా, పొటాష్ కలిపి చల్లడంవల్ల గింజలు తాల లేకుండా నాణ్యతతో వస్తాయని, ఫలితంగా అధిక దిగుబడితో పాటు గింజలు బరువు ఉంటుందని రైతులకు సూచించారు. యూరియా, పొటాష్ చల్లిన తరువాత వరి పైరును కాండం తొలిచే పురుగు, ఆకు ముడత పురుగు ఆశించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో, రైతులు ఉన్నారు.

నిజాంసాగర్‌లో..

నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని గోర్గల్, మాగి గ్రామ శివారుల్లో రైతులు సాగు చేస్తున్న వరి పంటలతో పాటు ఆరుతడి పంటలను సోమవారం క్లస్టర్ ఏఈవో రేణుక పరిశీలించారు. నువ్వుల పంటలో లద్దె పురుగు అధికంగా ఆశించిందన్నారు. దీని నివారణకు గాను క్లోరో పైరిపాస్ 500 ఎంఎల్ మందును పిచికారి చేయాలని రైతులకు సూచించారు. వరి పంటలో తెల్లకంకి రాకుండా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 400 ఎంఎల్ మందును పిచికారి చేయాలన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన సింగిల్ విండో చైర్మన్



మాచారెడ్డి: మాచారెడ్డి సింగిల్ విండో చైర్మన్ పూల్ చంద్ నాయక్ సోమవారం ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ సలహాదారు షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి షబ్బీర్ అలీ కాంగ్రెస్ లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కిషన్ గౌడ్, రామస్వామి ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కామారెడ్డి టౌన్ : పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన యువకులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇలియాజ్ సమక్షంలో పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు సందీప్ తదితరులున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



బీబీపేట : నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్నటువంటి పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం మండల వ్యాప్తంగా ఉన్నటువంటి గ్రామ పంచాయతీ కార్మికులు ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

సీఎం సభ లైవ్‌ను వీక్షించిన మహిళలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మహిళల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల గురించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రత్యక్ష ప్రసారాన్ని సోమవారం మహిళలు టీవీల్లో చూశారు. ఐకేపీ ఆధ్వర్యంలో తాడ్వాయి మండల కేంద్రంలో, మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళలందరూ ఒకేదగ్గర కూర్చొని టీవీలో ప్రసారం అవుతున్న పథకాన్ని వీక్షించారు.

185 మంది విద్యార్థులు గైర్హాజరు

బాన్సువాడ రూరల్ : మండలంలోని ఏడు సెంటర్లలో సోమవారం నిర్వహించిన ఇంటర్ పరీక్షకు 185 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 1,588 మందికిగాను 1,487మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 818 మంది పరీక్షలకు హాజరయ్యారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో రూ. లక్షతో మురికి కాలువ నిర్మాణం కోసం సోమవారం వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆసరాజు, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలు..

నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్‌నగర్ మండలంలోని కొమలంచ జీపీలో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను సోమవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు.మండల నాయకులు రవీందర్‌రెడ్డి, జయప్రదీప్, రమేష్‌యాదవ్, ఆకాష్ తదితరులున్నారు.

ఎర్రాపహాడ్‌లో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని ఎర్రాపహాడ్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రూ. 10 లక్షలు కేటాయించారన్నారు. ఎంపీటీసీ జలంధర్‌రెడ్డి, నాయకులు లక్ష్మణచారి, మోహన్‌రెడ్డి తదితరులున్నారు.

రాజంపేటలో..

రాజంపేట : మండంలోని సీసీ రోడ్డు పనులును స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఎస్‌ఆర్‌ఈజీఎస్ క్రింద మంజూరైన రూ. 10 లక్షల నిధులతో గ్రామంలో సీసీ రోడ్డు పనులను చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నర్మల రాజు, ఎంపీటీసీ, మాజీ సర్పంచ్ యాదవ రెడ్డి, నాయకులు, శివకుమార్, కృష్ణారెడ్డి, రాజలింగం తదితరులున్నారు.

వీరేశలింగం గురుమూర్తి స్వామికి తుది వీడ్కోలు

భిక్కనూరు : మండల కేంద్రానికి చెందిన వరకవి సిద్దప్ప రాజయోగి ఆశ్రమం నిర్వాహకుడు వీరేశలింగం గురుమూర్తిస్వామికి సోమవారం కన్నీటి వీడ్కోలు పలికారు. వీరేశలింగం గురుమూర్తి స్వామి శివైక్యం చెందిన విషయం తెలుసుకున్న ఆయన శిష్యులు భిక్కనూరుకు వచ్చి పార్థివదేహాన్ని చూసి కన్నీరు మున్నీరయ్యారు. భిక్కనూరులో అంతిమయాత్ర నిర్వహించారు. హైదరాబాద్, నిజామాబాద్, మెదక్, జుక్కలు ప్రాంతాలకు చెందిన స్వామిజీ శిష్యులతో భిక్కనూరు వాసులు పాల్గొన్నారు.

13 నుంచి తిర్మలాపూర్‌లో బ్రహ్మోత్సవాలు

బాన్సువాడ రూరల్ : ఈనెల 13నుంచి మండలంలోని తిర్మలాపూర్‌లో పద్మావతి సమేత శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు తూప్రాన్ జయశ్రీ శంకర్‌గౌడ్ తెలిపారు. ఆలయ బ్రహ్మోత్సవాలు 13న ప్రారంభమై 15న ముగుస్తాయన్నారు.

సమాచారం..

నేడు ఉచిత వైద్య శిబిరం

భిక్కనూరు : మండలంలోని జంగంపల్లిలో ఈనెల 12న మంగళవారం జీవన్ సేవ గ్రూప్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక జీపీ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం ప్రారంభమవుతుందన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండల కేంద్రంలో రైతు వేదికలో రేపు సాధారణ సర్వసభ్య సమావేశం కలదు అని ఎంపివో రాము ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిపి పాల్య విఠల్ అధ్యక్షతన జరుగు ఈ సమావేశానికి ప్రతి గ్రామ స్పెషల్ ఆఫీసర్,పంచాయతి కార్యదర్శులు,ఎంపిటిసీలు,వివిధ శాఖల అధికారులు పాల్గొనాలన్నారు.

15న ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డిరూరల్ (ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి మండల సర్వసభ్య సమావేశం ఈనెల 15న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మాధవి అధ్యక్షతన నిర్వహించే సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు, అధికారులు వారి నివేదికలతో హాజరు కావాలని ఆమె కోరారు.

ఆధ్యాత్మికం

హనుమాన్ ఆలయంలో ఎంపీ పూజలు



మద్నూర్(జుక్కల్) : డోంగ్లీ మండలంలోని ఎంపీ బీబీ పాటిల్ సొంత గ్రామమైన సిర్పూర్‌లోని శివాలయంలో, సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో సోమవారం జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసారి ఎన్నికల్లో జహీరాబాద్ స్థానానికి బీజేపీ ఎంపీ టికెట్ కేటాయించడంతో ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి ఎన్నికల ప్రచారం, పనులను ప్రారంభించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. పలువురు ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు బీబీ పాటిల్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలున్నారు.

నేటి నుంచి కోటదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవాలు

బాన్సువాడ : నేటి నుంచి బాన్సువాడలో కోటదుర్గమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పత్తి శ్రీకాంత్, ఉప్పరి లింగం తెలిపారు. 12న 108 కళాశాలతో అభిషేకాలు, 13న చండీహోమం, శివపార్వతుల కల్యాణం, 14న మండపారాధన, యాగశాల, బోనాల ఊరేగింపు ఉంటుందన్నారు.

ఘనంగా ఘృత పూజ



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండలంలోని కాటేపల్లిలోని హనుమాన్ ఆలయంలో ఐదు రోజులు అఖండ హరినామ సప్తహ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఘృత పూజ నిర్వహించారు.

గోపాల్‌పేట పంచాయతీ కార్యదర్శి బదిలీ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేట గ్రామపంచాయతీ కార్యదర్శి భూమేశ్వర్ సోమవారం జుక్కల్ మండలం కంతాలి గ్రామానికి బదిలీ అయినట్లు స్థానిక ఎంపీడీవో పర్బన్న తెలిపారు. జిల్లా అధికారుల నుండి వెలువడిన ఉత్తర్వుల ప్రకారం భూమేశ్వర్‌ను రిలీవ్ చేసినట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం మండలంలోని ధర్మారెడ్డి గ్రామపంచాయతీ కార్యదర్శి సత్యనారాయణకు గోపాల్‌పేట గ్రామపంచాయతీ ఇంచార్జీ బాధ్యతలు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

బస్టాండ్లు నిర్మించండి

భిక్కనూరు : మండలంలోని సిద్దరామేశ్వరనగర్ శివారులోని జాతీయ రహదారికి ఇరువైపులా బస్టాండ్లను నిర్మించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి మంగళవారం నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్‌కు లేఖ రాశారు. ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. బస్టాండ్లు అత్యవసరమని లేఖలో పేర్కొన్నారు. వెంటనే బస్టాండ్ల నిర్మాణ పనులను ప్రారంభించాలన్నారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ



తుజాల్‌పూర్ పాఠశాలలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి



ఘన్‌పూర్ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతూ..

బీబీపేట : మండలంలోని తుజాల్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలకు హాజరవుతున్న ఉపాధ్యాయుల రిజిస్టర్‌లను పరిశీలించారు. ఉపాధ్యాయులు టైంకు వస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన వివరాలు తెలుసుకున్నారు.

సమయపాలన పాటించాలి

మాచారెడ్డి : ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని ఘన్ పూర్(ఎం) ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. హాజరు పట్టికలను పరిశీలించిన అనంతరం డీఈవో, ఎంఈవోలతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సహకరించాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మండల ప్రజలు ప్రతి ఒక్కరు సహకరించాలని జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఎంపీ బీబీ పాటిల్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తలతో సమావేశం అయ్యారు. మండల అభివృద్ధికి కట్టుబడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలోబీజేపీ మండల యువ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రంలో సందడి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవాకేంద్రానికి సోమవారం మండలంలోని వివిధ గ్రామాల నుండి బాధితులు పోటెత్తారు. గృహజ్యోతి పథకం కింద జీరో కరెంట్ బిల్లు రాని బాధితులు ఉదయం నుండి సాయంత్రం వరకు కార్యాలయానికి తరలివచ్చారు. కార్యాలయంలోని సేవాకేంద్రంలో బాధితులు వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నారు.

గ్రామాల్లో గృహజ్యోతి బిల్లుల అందజేత





ఇసన్నపల్లిలో గృహజ్యోతి జీరో బిల్లులు చూపుతున్న కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు, రాజంపేటలో..

భిక్కనూరు : మండలంలోని ఇసన్నపల్లి గ్రామంలో జీరో విద్యుత్ బిల్లులు రావడంతో గృహజ్యోతి పథకం లబ్ధిదారులు సోమవారం సంబురాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ మండల ఓబీసీ అధ్యక్షుడు వడ్ల తిర్మల్ స్వామి ఆధ్వర్యంలో సంబురాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు యాదగౌడ్, బాబు, నారాయణ, రాములు, బాబు తదితరులున్నారు.

రాజంపేట : మండల కేంద్రంలో సోమవారం గృహజ్యోతి జీరో కరెంటు బిల్లులను కాంగ్రెస్ నాయకులు ఇంటింటా తిరుగుతూ వినియోగదారులుకు జీరో బిల్లులను అందజేశారు. మండలం కిసాన్ సెల్ మండలం అధ్యక్షుడు జుకంటి సుధాకర్‌రెడ్డి, గ్రామ ఉపాధ్యక్షుడు బెస్త చెంద్రం ఇమ్రాన్ అలీ, మైనారిటీ నాయకులు రహమత్, ఎ స్సీ సెల్ అధ్యక్షులు దభీమయ్య, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుల నియామకం



సదాశివనగర్ బీజేపీ మండలాధ్యక్షుడు రాంరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు



మాచారెడ్డిలో..



నరేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి



రంజిత్‌గౌడ్ (బీబీపేట మండలాధ్యక్షుడు)



భూపాల్‌రెడ్డి (దోమకొండ)



శ్రీకాంత్ (నాగిరెడ్డిపేట)



శ్రీనివాస్ (లింగంపేట)



నర్సింలు (ఎల్లారెడ్డి)

కామారెడ్డి టౌన్/సదాశివనగర్/బీబీపేట/మాచారెడ్డి/దోమకొండ/నాగిరెడ్డిపేట/ఎల్లారెడ్డిరూరల్/లింగంపేట : బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బండారు నరేందర్‌రెడ్డిని నియమించారు. జిల్లా అధ్యక్షురాలు అరుణతార సోమవారం నియామకపత్రాన్ని అందజేశారు. సదాశివనగర్ మండల బీజేపీ అధ్యక్షునిగా కల్వరాల్ గ్రామానికి చెందిన రాంరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నాయని మహిపాల్ యాదవ్ సోమవారం తెలిపారు. బీబీపేట మండల బీజేపీ అధ్యక్షుడిగా బీబీపేట గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు బట్టుపల్లి రంజిత్‌గౌడ్‌ను నియమించారు. మాచారెడ్డి మండలం నుంచి బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడిగా తోట బాల్‌రాజు, మాచారెడ్డి, పాల్వంచ మండలాల నూతన అధ్యక్షులుగా బూస సురేష్, పోసు అనిల్‌ను సోమవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార నియమించినట్లు ఓబీసీ జిల్లా అధ్యక్షుడు తోట బాల్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. దోమకొండ మండల బీజేపీ అధ్యక్షుడుగా మద్దూరి భూపాల్‌రెడ్డి నియమితులైయ్యారు. నాగిరెడ్డిపేట బీజేపీ మండలాధ్యక్షునిగా మండలంలోని పోచారం గ్రామానికి చెందిన సత్యబోయిన శ్రీకాంత్‌ను నియమించారు. ఎల్లారెడ్డి మండల బీజేపీ అధ్యక్షుడిగా పెద్దెడ్ల నర్సింలును నియమించారు. లింగంపేట బీజేపీ మండల అధ్యక్షుడిగా మాసు శ్రీనివాస్‌ను నియమించారు.